బొమ్మలు

"అరూ ! ఇటు రా ! తాతయ్యకి చూపవే జడ!" రాణి పాపని పిలిచింది.

"జడకుట్టేరా! ఓహోహో! భేష్! ఏదీ తిరుగమ్మా! ఫష్...ట్టుగాఉంది. ఇంకేం? నాకు నచ్చింది. నేనే చేసుకుంటాను." తాతయ్య నవ్వుతూ అన్నాడు.

"నేను...చేసుకోను...ఫో..." రెండు చేతుల్తో ముఖం కప్పుకొని వేళ్ళసందు ల్లోంచి అందర్నీ చూస్తూ అంది అరుణ! నాలుగేళ్ళ పాప.

"ఏ య్ ! తా త య్య కేమయిందే? ఎందుకు చేసుకోవు?" బామ్మ అడిగింది.

"తాతయ్య...ఏమీ బావులేడు. నా క్కొద్దు...నే చేసుకోను..." సోఫాలోంచి హాల్లోకి ఉరికింది అరుణ.

"ఎవరు కుట్టేరే రాణీ! జడ? బాగా... చి...న్న సవరం బలేతగిలించికుట్టారు?"

"ఇంటిపక్క ఉన్నార త్తయ్యా— సేర్ లు. ఆయన భార్య కుట్టింది."

"బాగా అమరింది పిచ్చిముండకి! సరిగా చూడనివ్వవే చలాకీ! ఏయ్ అరూ! రావే" బామ్మ కేకేసింది.

"ఒక్కోసారలా సిగ్గు! డాన్సుకూడా చేస్తుంది."

"ఆహా! డాన్సుపాపన్న మాట! అరూ! ఇలా రావే! చేసుకోకుంటే సరే లే. నేను పాట పాడతా డాన్సుచేస్తువుగానీ రా! రారారా!" తాతయ్య పిలిచాడు.

"రావే అరూ! ఏమదీ? తాతయ్య పిల వటంలేదూ? డాన్సు చూపుదురా!" రాణీ గద్దించింది.

వాకిలిచాటున నిలచిన అరుణ దొంగ చూపులు చూస్తూ, నక్కుతూ బయటికి వచ్చింది. బామ్మ రపీమని చెయ్యట్టుకు దగ్గరికి లాక్కుని ఒళ్లో ముడిచి ముద్దుల వర్షం కురిపించింది.

"చాల్లెద్దూ నీముద్దులు! దాన్ని డాన్సు చేయనీ! చేయమ్మా! ఊఁ డాన్సు పాపా! డాన్సు పాపా బడికి పోతావా? వద్దుబాబు అయ్యవారు కన్నుకొడతారు.." తాతయ్య చేతులూపుతూ పాటపాడడం మొదలు పెట్టాడు.

అందరికీ నవ్వే. అరుణ ముఖం కప్పేసుకు నవ్వుకుంది.

"పాట పాడుతూ ఆడవే అరూ! మామయ్య వస్తాడు మళ్ళీ. కానివ్వు."

అరుణ చేతులూపుతూ— "బిందావన మందది...గోయిందు గందరివాడేలే... అందరాడేలే" అంటూ ఎంతసేపూ అదే చరణం, అదే చేతులూపటం, నడుం తిప్పటం.

వేలెడెంత పాప! చూడ ముచ్చటగా అందరికీ కన్నులపండువగా కొండపల్లి బొమ్మలా ముద్దులు గురిపిస్తోంది.

ఉన్నట్లుండి గోడచాటుకి వెళ్ళి రెండు చేతుల్తో ముఖందాచుకు నిల్చుంది.

"ఏమి? ఎందుకలా ఉరికావూ?" రాణి అడిగింది.

"అదిగో వాళ్ళ సూరిమామయ్య వచ్చేశాడు. సిగ్గు. ఒరేయ్ సూరీ! నీ కోడలు వచ్చింది. జడల్లుకుంది. చూ

డసలు చూడు. పో అరూ! మామయ్యకి చూపు." బామ్మ అంది.

"ఏదీ! రావే కోడలుపిల్లా! జడచూపి కాళ్ళకి మొక్కితే పది పైసలిస్తా! రా!" సూరి ఎగతాళిగా అన్నాడు.

"బాగుందయ్యోవ్! అంతగా అలంకరించుకు వచ్చి దాని షోకు నీకు చూపి... పైగా కాళ్ళకి మొక్కితే పది పైసలా! మరీ అంత తీసేయకయ్యా నీకోడల్ని!"

"పోనీ ఎంతివ్వాలో దాన్నే చెప్పమనక్కా ఇచ్చేస్తాగా!"

"అరూ! విన్నావా! సూరిమామయ్య ఏమంటున్నాడో? వెళ్ళు. జడచూపి, నమస్కారం చేసి డాన్సుకూడాచేసి చూపించి మరీ ఫీజు వసూలు జేయవే."

"ఓసబ్బో! డాన్సుకూడా చేస్తుందే? ఎలా? జయమాలిన్లానా. సూర్యకాంతం లానా అక్కా?" నవ్వుతూ అన్నాడు.

"నీతో యిదేరా నానీ వచ్చిన చిక్కంతా! మాటల్తో మింగేసి దాన్నసలు నిలబడకుండా చేస్తావు! చూడసలు ఎలా చేస్తుందో. రామ్మా! అరూ! డాన్సు చెయ్!"

"చెయ్యవే! పేద్ద బడాయి! నే చూడనులే...చెయ్!"

అరుణ నెమ్మదిగా వచ్చి 'శివరంజనీ' అంటూ చేతులూ నడుమూ ఊపుతూ, మధ్యమధ్య మామయ్యను చూసి సిగ్గులు పోతూ చేతుల్తో ముఖంతిప్పేస్తు ఆడింది.

సూరి పకపక నవ్వేశాడు.

"ఫర్లేదు. బాగానే చేస్తుందక్కా!"

"ఏమనుకున్నావురా మరి నీ కోడలంటే...

"ట్విస్టు వస్తుందాక్కా అరూకి? ఏదీ ఆరూ! రాకెన్రోల్ చెయ్‌వే!"

అరుణ అలానే తలూపి, కాళ్లుచాచి, నడుంమీద చేతులుంచి మెడనిక్కించి ఏదో చేసినా, అది ట్విస్టులా లేకున్నా చూచేందుకి అందరికీ ముచ్చట గొల్పేలానే ఉంది.

"వెళ్ళి మామయ్యకి నమస్కారం చేయమ్మా అరూ!"

అరుణ మామయ్య పాదాలకి తలానించి నమస్కారం చేసింది.

ఎంతో వినయంగా.

"తే! తే! యూ డాన్సింగ్ డాల్!" అంటూ లేపనెత్తి చేతిలో పదిరూపాయల నోటుంచాడు.

"అమ్మా! అమ్మా! మామయ్యే దబ్బి

వ్వలేదు. ఉత్తి కాగితం యిచ్చాడే. నవ్వు కున్నారందరూ!"

"ఏమే! ఏంచేస్తున్నావక్కడ? ఇంకా తెమల్లేదూ పని? వాడాఫీసుకి పోవాలనుకున్నావా? ఇంట్లో ఉండిపోవాలనుకున్నావా?"

పార్వతమ్మ గద్దించి మాట్లాడింది.

అద్దంముందు కూచొని భాస్కర్ చొక్కాగుండీలు కుడుతూ మిర్రర్ టేబుల్ మీది ప్లాస్టిక్ బొమ్మని చూడగానే గతంలో అమ్మ చెప్పిన తన బాల్యం గుర్తుకు పచ్చి దాన్నిగురించే ఆలోచనలో పడిపోయిన అరుణ అత్తయ్య గద్దింపుకి ఉలికిపడి యీ లోకంలోకి వచ్చేసింది.

"వస్తున్నానత్తయ్యా!" అంటూ గబగబా హాల్లోకి వెళ్ళింది

"ఏం పనేమీలేదనుకున్నావా?" అరుణ చేతిలోంచి షర్టు లాక్కుంటూ విసురుగా తొడుక్కున్నాడు భాస్కర్

గబగబా తలదువ్వుకొని బూట్లుతొడుక్కు బయలుదేరాడు.

"ఏమండీ! కాఫీ!" కప్పుతీసుకు ఎదురు వచ్చింది అరుణ

"ఇంకేం తెచ్చుకున్నావుగా? నువ్వే తాగు" బయటికి నడిచాడు భాస్కర్.

"భోజనానికి వస్తారా?"

"రాను. నా భాగంకూడా నువ్వే తిను." చిడిముడిలాడుతూ చిటపటలాడుతూ భాస్కర్ విసవిసావెళ్ళిపోయాడు

"ఏం పాపం చేసుకున్నానో ఏమో! పాపం! బిడ్డడు ఒక్కరోజున్నా సంతోషంగా యింట్లో నిలబడ్డ పాపానపోలేదు. ముదనష్టపు శనిగ్రహం అడుగుపెట్టింది.. అంతే...ప్చ్! వాడి జీవితంలో ఆనందమే కరువైపోయింది."

పార్వతమ్మ సణుక్కుంటూ అరుణ వేపు చూచింది కోపంగా.

"ఏం? యింకా అలానిలబడకపోతే తాగేయరాదూ, కాఫీ తాగమ్మా! కడుపునిండా కాఫీతాగి... తయారౌదువు నామీదికి దండయాత్రకు వంటచేసి పెడతాను గానీ... తిని ఏ మూటినీకో వెడుదువులే అయ్యో నారాతా వాడికొక ఆటా పాటా! పాదంమోపటమూ అన్నీ హుష్కాకీ..." ధుమధుమలాడుతూ బాత్రూంలోకి వెళ్ళిపోయింది పార్వతమ్మ.

అరుణ పొంగివస్తున్న ఏడ్పుని మునిపంట నొక్కిపెడుతూ కాళ్ళీడ్చుకుంటూ తనగదిలోకి వెళ్ళింది. అద్దంముందు నిలబడి తనని తనే చూచుకుంది ఉహూఁ! ఎంత నొక్కినా ఆగని దుఃఖం కళ్ళల్లో నీళ్ళగా కదిలివస్తునే ఉంది చల్లారిన కాఫీని బల్లమీద పెట్టేసి సోఫామీద జేరగిలా కూలబడింది

అద్దంముందు ఫోటో ఫ్రేంలో తన వైపే నవ్వుతూ నిలబడ్డట్టున్న సూరి మామయ్య ఫోటోని చూడగానే ఏడ్పు ఆగకుండా దూకేసింది.

సూరి మామయ్య చిన్నప్పుడు తన నెత్తుకొని వేయించుకున్న ఫోటో అది

ఎంత ప్రేమో తనంటే సూరి మామయ్యకి.

అందంగా చిలిపిగా ఇంత విశాలమైన కళ్ళతో నుదురుతో నవ్వుతూ నిలబడ్డ మామయ్యని చూస్తుంటే అమ్మ మాటలే గుర్తొచ్చాయి అరుణకి

"లేవే అరూ! బారెడు ప్రొద్దెక్కినా నిద్రలేవవా! అంతా సూరి మామయ్య అలవాట్లే... లేలే!" ముసుగు తీసేస్తు అమ్మ లేపింది

"అబ్బ! ఉండవే! మాంచి కలవస్తుం దేనూ... అమ్మా!అమ్మా! కాస్సేపు పడుకోనీవే... నిద్దరొస్తుందే..."అరుణ బ్రతిమాలింది,

"లేవే సోమరీ! అంతా సూరిచాలే అన్నీ వాడి నాటకాలే... వాడే నీవుగా పుట్టినట్లుందే మాయింటికి లే... లే .. కాలేజీకి వెళ్ళవా?"

కాలేజీ పేరు చెప్పగానే టకీమని లేచికూచుంది చెప్పా చెయ్యకుండా అన్నీ ముగించుకుని రెడీ అయి వచ్చి అమ్మ ముందు నిలబడింది

"మమ్మీ టిఫిన్ "

"కొంచెం ఉండు అయిపోయింది ఉప్మా పెడతాను"

"ఇంకాం కొంచెం సేపా? నోనో! టైయిం చూడవే! సిటీ బస్ దొరకదు మళ్ళీ .. కాఫీ యివ్వు..."

"టిఫిన్... చేసీ..."

"అమ్మా... కాఫీ!"

"అబ్బబ్బబ్బ! నీతో ఏదొచ్చినా యింతే... ఇంత సేపూ మొద్దు నిద్ర పోయింది ఎక్కడ పోయిందో ." రాణి కాఫీ కలుపుతూ అంది

"అమ్మా! మామయ్యకూడా యింతే నా!" అరుణ అర్థంతరంగా అడిగింది

"ముమ్మూర్తులా యింతేనే తల్లీ! వాడి వారసత్వం ఈయింట్లో నువుపుచ్చు కున్నావు "

"మామయ్యే మరి చాలా మంచి మామయ్య కదమ్మా! ఆయన అలవాట్లు ఒక్కరికేనా రాకుంటె యెట్లాగా?అందుకే నేను పుచ్చేసుకున్నాను." నవ్వుతూ కిల కిలా, కాఫీ తాగేసి గబగబా వెళ్ళి పోయింది

రాణి అరుణ పోయిన వేపే చూస్తు ఆలోచనలో పడిపోయింది

"పిచ్చి అరూ! కష్టం సుఖం తెలీని కలలరాణిలా మెలిగిపోతోంది ఆదాయ మేమో, బ్రతుకేమో ఆలోచనే లేదు వాళ్ళ నాన్న ఆరోగ్యం చెడిపోయినప్పటి నుంచీ వ్యాపారం తగ్గిపోతోందన్న సంగతే, అప్పులు పెరిగిపోతూ వాయన్న సంగతే దానికేం పట్టిం..! ఎంత సేపూ తనచదువూ, సినిమాలూ, పాటలూ! జల్సాగా కాలం గడపాలంటుంది కొంచె మైనా భవిష్యత్తు గురించి ఆలోచనే లేదు

"ఏమిటే! ప్రొద్దుటే ఆలోచనల్లో పడ్డావు!" మూర్తి పలకరిస్తే యీలోకం లోకి వచ్చింది రాణి. తన ఆలోచన చెప్పింది

"ఈ కాలం పిల్లల తత్వమే అంతే! మనం చీకూచింత లేకుండా జీవించాలీ అనే తత్వం అమ్మా నాన్నా తమకోసం ఎంతగా ఎందుకు శ్రమిస్తున్నారన్న ఆలోచన అసలు దగ్గరకి రానివ్వనితరం యిది పైగా పె పకం ప్రభావం అవలా జల్సాగా బ్రతకాలనుకునేందుకి నీ పెంప కమూ ఒక కారణం కాదూ!"

"బాగుందండీ! నామీదే వేశారూ నెపం?"

"కోప్పడకు రాణీ! వచ్చిన ప్రతి

సినిమా చూడాలనే తత్వంనీది రోజూ వరసగా మ్యాట్నీలూ, షోలూ చూస్తునే ఉంతమన్నా ఉంటావు టయ్‌లెట్లకి ఎం తేనా తగలేస్తావు చీరెలూ నగలూ అంటూ చిందులేస్తుంటావు.. మరి తల్లిని పట్టి పిల్లకదా! ముందు మనం కట్టిబాటులో ఉంటే కదా రాణీ! పాప మన కట్టుబాట్లు పాటించడానికి?"

రాణి మళ్ళీ ఆలోచనలో పడింది

"ఏయ్! రాణీ! కాఫీ అయిందా? మళ్ళీ ఆలోచనేమిటి?"

"నిజమేనండీ! మనదీ పొరబాటే ఉండండి! ఉప్మా అయింది తిని కాఫీ త్రాగుదురు"

"టయింతేదులే. కాఫీ యివ్వు అయినా యిప్పుడే అరూని గురించెం దుకే ఆ లోచనలన్నీ?"

"మన జాగ్రత్తలో మనం ఉండా లంతే! ముందేమవుతుందో" కాఫీ అందిస్తు అంది రాణి

"ఎవరికెప్పుడేమి కావాలనుంటే అదే అవుతుంది"

కాఫీ తాగి మూర్తి వెళ్ళి పోయాడు

మూర్తి వ్యాపారం పూర్తిగా మునిగి పోయింది

అరుణ కాలేజీ మానేసింది మూర్తి పెళ్ళి సంబంధాలు వెకదసాగేడు

"ఏమండీ! ఒకమాట మన సూరి నడుగుదామండీ!" రాణి అడిగింది

"రాణీ! ఇపుడు మనమేమీ లేని వాళ్ళం! వాళ్ళతో మనం తూగరేం, వాడొప్పుకోడేమో!"

"నేనడిగి చూస్తానండీ!సూరి నామాట కాదనడని నా నమ్మకం"

"నీ యిష్టం!"

రాణి సూరినడిగింది మామయ్య సంతోషంగా ఒప్పుకున్నాడు

"డాన్సింగ్ డాల్ నా సొంతం అవ తానంటే వద్దంటానా అక్కయ్యా!" అన్నాడెంతో సౌజన్యంగా

కానీ అరుణే మామయ్యా వద్దనింది

ఎందుకు వద్దందో తనకే అర్థం కాలేదీరోజు వరకూ అందం లేదా? హృదయం లేదా? వినయంలేదా? ప్రవ ర్తన బాగోలేదనే వీలేలేని మంచిమనిషి!

"నేను బాలేని మనిషినీ అంటే మా రవిమాష్టారు చెడ్డాడనేఅర్థం అక్కయ్యా ఆ మాష్టారి అభిమానశిష్యుడనై, ఆయన ప్రేమకు పాత్రుడనై నేను పనికి మాలిన వాడినైతే యింకేముంది? మొదట మా మాష్టారు పిచ్చాడై పోతారు తరువాత నేనదృశ్యమై పోతాను తెలుసా?"

పదేపదే సూరిమామయ్య అమ్మతో అనేవాడు తాను వినేది

నిజమే! తనకూ తెలుసు రవి మాష్టా రెంతో సౌజన్య మూర్తో! సూరి మామ య్యంటే ఆయిన కెంత ప్రాణమో!

మరెందుకు తాను సూరి మామయ్యని వద్దంది! పెద్దవయస్సనా! తనకీ మామ య్యకి పదకొండేళ్ళ వ్యత్యాసం అస లంత వయసు కనబడదు మామయ్యలో మరెందుకు?

ఎందుకో ఆనాడర్థం కాలేదు ఈరోజు అర్థమవుతోంది

భాస్కర్ మీద తనకు తెలీకుండానే యేర్పడిన ఆకర్షణ! అది ప్రేమా? ఆక



ర్షణా? ప్రేమ అని తాననుకొంది. భాస్కరూ అన్నాడు.

ఈనాటికీ భాస్కరంటే తనకదే భావనే... కాని... కాని...?

భాస్కరుకు?

పోయింది, పువ్వువాడిందని... మోజుతీరిందని...

అరుణ వెక్కి వెక్కి యేడ్చింది!

తాను ప్రేమించిన నేరానికి, తనమీది మమత కొద్దీ, అమ్మ పోరుమీదా నాన్న సరే అననైతే అన్నాడు. కాని ఎక్కడ నుంచి తేగలడంత కట్నం?

చదువుకున్న రాక్షసులు నిరంతరం కట్నంబాపతు సొమ్ము తేలేదమని వేధిస్తుంటే చదువుకున్న తన జీవితం ఏం కావాలి?

ఎవర్నడగాలి? వ్యాపారమే ఎత్తేసి సామాన్య జీవనంలోకి దిగజారి నానా యాతనలు పడుతున్న నాన్ననా?

దుబారా సుఖాలకలవాటుపడి, కోర్కెలని చంపుకోలేకా, తీర్చుకొందికి మార్గమూ దొరక్క అసంతృప్త జీవనంలో అల్లాడి పోతూన్న అమ్మనా? ఎవర్ని?

అరుణ మానసిక వేదనతో కుమిలి పోయి అలానే నిద్రలోకి వొరిగిపోయింది

o o o

ఉలికిపడి లేచింది అరుణ.

గదంతా చీకటి: తనచుట్టూచీకటి.తన హృదయంలో, మనస్సులో అంతాచీకటి.

తలనిండా ఏదో బరువైన పదార్థం దూర్చినట్లు భావన. తలమీద ఏదో బరువు మోసినంత బాధ

కళ్ళల్లో గుచ్చినట్లు నలక. తెరిచే కళ్ళని సూదులతో గుచ్చినట్లు తీపు.

లేవాలని ఆలోచన. లేపనియ్యని అలసట

"ఏమైంది నాకు? ఎందుకిలా? ఎంత టయిమయిందప్పుడు?' తనకుతానే అడుగుతోంది. జవాబులేదు.

ప్రక్కనేవో గుసగుసలు!

గాజుల గలగలలు!

నవ్వుల కిలకిలలు!

తర్వాత క్షణం నిశ్శబ్దం.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ వేడి నిట్టూర్పుల సవ్వడులు.

అరుణ భరించలేక పోయింది. ఒక్క ఉదుటున మంచం మీది నుంచి దూకి పరుగెత్తి తలుపులవద్దకు వెళ్ళింది. తలుపులు రాలేదు. ఆశ్చర్యం! భయం.

దబదబా బాదేసింది. చేతులకి బొబ్బలు. గాజులు చిట్లాయి.

గుచ్చుకున్నాయి. నెత్తురు చెమ్మ వళ్ళినట్లుంది. చిరుమంట- చురచురమని బాదేధైర్యంలేదు. చేతులెత్తలేకపోతోంది

"ఏమండీ! ఏమండీ! అత్తయ్యా! అత్తయ్యా" ఒకటే అరుపు. అరచి అరచి...... అలానే సొమ్మసిల్లి పడి పోయింది. కొంచెంసేపు గడిచి...

నెమ్మదిగా మెలుకువ వచ్చింది.

ఏదో స్పర్శ. తన ఒళ్ళంతా ఆవరించిన స్పర్శ. ఆస్పర్శలో సుఖం. అదో చైతన్యం. అదో అనుభూతి. తనకు తెలియని, తానంగీకరించకుండా అంగీకరించే అర్ధాంగీకార పైత్యం:

ఏమది? ఏదో తియ్యని మత్తు. ఏదో స్పృహలోనే ఉన్నా మత్తులోకి జార్చే గమ్మత్తు.

కలా? నిజామా?

నిజమే! నిజంగానే తనకేదో అవబోతూన్నది?

తానెక్కడుంది?

కళ్ళు తెరచి చూచింది.

అంతా చీకటి.

కంటి రెప్పలు మూతలు పడ్డాయి. అహఁ ఎవరివో వేడి అధరాలు మూసేశాయి.

"అ...త్..." అత్తయ్యని కేకేయబోయింది.

'ష్...అతవక! నేను...' పెదవులు మూతలు పడ్డాయి.

'భాస్కరా! తన భాస్కరు.' స్వాప్నిక జగత్తులోంచి వాస్తవంలోకి వచ్చి నిజాన్ని గ్రహించి సంతోషంస్వీకరించి హాయిగా తృప్తిగా నిద్రలోకి పోయింది.

అద్దంలో తనను తాను చూచుకొంది అరుణ

○ ○ ○

'ఏమిటిది? ఒళ్ళంతా వాతలు. ముఖాన కాట్లు. విరిగిన ఎముకలు, రాత్రేం జరిగింది? అది కలా? ఉహుఁ కాదు...కల కాదు...నిజం! రాత్రి భాస్కరూ తనూ... ఔను...నిజమే... మరిదేమి? ఇది అబద్ధమా? కానేకాదు; ఏది నిజం? ఏది కల? భగవాన్!'

"ఏం చాల్లేదా? సాయంత్రం నేను వచ్చేవరకల్లా నిర్ణయం తీసుకు ఉండు. వెళ్ళిపోతావో? ఉండి...ఆఁ?"

భాస్కర్ విసురున వెళ్ళిపోయాడు.

అరుణ ఆలోచల్లోకి వెళ్ళింది. పిచ్చిగా నవ్వుకుంది.

'హుం! ఆ వచ్చేదానికి నేనీ యింటి పనిమనిషినని చెప్పుకోవాలట! ఆయన గదిలోకీ, అత్తగదిలోకీ వెళ్ళరాదట... లేకుంటే...'

అరుణ ఓ నిర్ణయం తీసుకుంది. సరాసరి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళింది.

స్టేషన్‌ఆఫీసర్ అరుణవేపు ఎగాదిగా చూచాడు. ఆమె చెప్పిందంతా సావధానంగా విన్నాడు. ఏదో వ్రాసుకున్నాడు.

"సరే నువ్వెళ్ళు. సాయంత్రం వచ్చెయ్! ఏ సంగతీతేల్చిపడేస్తాను"అన్నాడు.

"మరచిపోకండి సార్! నా కాపరం నిలబెట్టితే నాకంతే చాలు."

"తప్పకుండా...నువ్వెళ్ళు సాయంత్రం రా."

అరుణ వెళ్ళిపోయింది.

సాయంకాలమూ వచ్చింది. అది చీకటిగా మారిపోయింది.

అరుణ మళ్ళీ యింటిముఖం చూడలేదు.

భాస్కరు సంతోషానికి అవధులు లేవు.

రాణి మూర్తి యిల్లువదలి బయటికి బయటికి అడుగు పెట్టే స్థితిలో లేరు.

శోకం గుసగుసలాడుకుంది.

తెలియనట్లే నటించింది సమాజం!

ం ం ం

రాత్రి దాదాపు పన్నెండు గంటలు కావస్తోంది.

విశాలమైన రాజధానీ నగర వీధుల్లో అడపాదడపా వాహనాల శబ్దాలూ, ఎక్కడో కుక్కల మొరుగులు తప్ప మరేమీ వినరావటం లేదు. జినజినమని వానకురుస్తోంది.

'హోటల్ ఆశా' లో ఓగది. టక్ టక్‌మంటూ సవ్వడి.

అంతవరకూ కథల పోటీక గ వ్రాసిన ఓకథని ఫెయిర్‌చేస్తూ కూచొ అప్పుడే నడుం వాల్చిన ఆవ్యక్తి ఎ రబ్బా అనుకుంటూ వచ్చి తలుపుతీశాడు మేలిముసుగు ముందుకు జార్చిన యువతి గబగబ లోపలికివచ్చి తలుపుల మూసింది. లైటు తీసింది.

''ఎవరు? ఎవరునువ్వు! ఏం కావాలి' కాస్త హెచ్చుస్థాయిలోనే ఆ రచయిత అడిగాడు గద్దిస్తు.

''ష్... అరవక! ఈ హోటల్‌కిం మామూలే... ఆడదాన్నెందుకు వస్తాను అర్ధరాత్రి?''

''ఎవరు నువ్వు? నీ గొంతెక్కడ విన్నట్టుందే...'' అతను లైటు వేశాడు ఆవిడ ముసుగుయింకా ముందరికి జార్చు కుంది.

''ఏం మగాడివి! ఛ! పనికిమాలి బేరం! లైటు తియ్! వెళతాలే... ఉ పిరికివి...'' వెళ్ళబోయిందావిడ.

''ఆగు! ఆ ముసుగు తియ్! నీముఖ చూడనీ...''

''ఏం? ముఖం చూచి ముచ్చటప తావా?''అంటూ ముసుగు తీసింది తలె చూచింది.

ఆతనూ, ఆవిడా ఒకేమారు షాక్ తిన్నారు.

''అ... రు... ణా!'' అని అత నోటా.

''సూ ... రి మామయ్యా'' అ

ఆవిడనోటా ఒకేమారు వచ్చాయి,

"అరూ! అరూ! ఏమిటిది? ఏమిటి. అరూ! నువ్వు...భాస్కర్...?" సూరికి తల తిరిగిపోతోంది.

అరుణ కన్నీటితో అతని కాళ్లు తడిసి పోతున్నాయి.

భాస్కర్ అన్యాయం, పోలీసుల ఘాతుకం, మూకుమ్మడి అత్యాచారం, అక్కడినుంచి వ్యభిచార గృహప్రవేశం. దానితో అధః పాతాళానికి దిగజారిన తన జీవితం అంతా వివరించింది అరుణ!

సూరి మూర్తీభవించిన శోకమూర్తిలా నిలబడి పోయాడు.

అతని మస్తిష్కంలో అనంత భావ శకలాలు ఉల్కలై రాలాయి.

నిర్ణయం మెరిసింది తటిల్లతలా.

అరుణ తల నిమిరాడు... "లే! అరూ!" అంటూ లేవనెత్తాడు. అరుణ లేచి నిలబడింది తలవాల్చిందతని ముందు...

"నాతో వస్తావా అరూ! శాశ్వతంగా నాతో ఉండిపోతావా?"

అరుణలో విద్యుత్ ప్రకంపనం కంపించిపోయిన భావోద్రేక ఉద్వేగాలు! ఆశ్చర్యంగా, భయంగా చూచింది అనుమానంగా.

"అ...త్తయ్య...?!?"

"నీవే అత్తయ్యవి..." సూరి నవ్వుతూ అన్నాడు.

"పెళ్ళిచేసుకోలేదూ...?" అరుణలో ఆశ్చర్యంతో పాటు సంతోషం.

"ఉహుం! చేసుకోరాదనే అనుకున్నాను. కానీ ఇప్పుడు... ఏం? మరి?" సిగ్గుతో తలవంచింది అరుణ.

'నాలో మళ్ళీ చిగురించిన కొత్తఆశలు నీరోస్తున్న సూరిమామయ్యా!' అరుణ చటుక్కున వంగి సూరి పాదాలకు నమస్కరించింది.

"లే...లే... [illegible]" అంటూ మరో బెడ్ [illegible]

తృప్తిగా క[illegible] సూరి.

కలల[illegible]తుల[illegible] అరుణ.

---

* జి. సుబ్రహ్మణ్యం *

రాము సోము రెండుకుక్కపిల్లల్ని తెచ్చి పెంచుకోసాగారు. ఎవరికుక్కపిల్ల ఏదో తెలుసుకోడం కోసం రాము కుక్కపిల్ల మెడకి ఓ రిబ్బన్ కట్టారు. ఓ రోజు ఆ రిబ్బన్ కాస్తా ఎక్కడో పడిపోయింది.

"ఇప్పుడు ఎవరికుక్కపిల్ల ఏదో ఎలా తెలుసుకోవడం" విచారంగా అడిగాడురాము.

ఇద్దరూ కాస్సేపు ఆలోచించారు.

"ఆ! యికనుంచి- ఆ తెల్లరంగు కుక్కపిల్ల నాది- నల్లది నీది" అన్నాడు సోము.